



బోట్ క్లబ్ వద్ద అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

# మాఫియా.. ఇంతింత కాదయా!



కాకినాడ పోర్టు నుంచి విదేశాలకు రేషన్ బియ్యం ఎగుమతి మాఫియాపై రాష్ట్ర ప్రభుత్వం మరింత ఉచ్చు బిగిస్తోంది. అయిదేళ్లలో రూ.800 కోట్లకుపైగా రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి విదేశాలకు విక్రయించినట్టు దాదాపు ఇప్పటికే ఓ అంచనాకు వచ్చింది. దీనివెనుక ప్రధాన సూత్రధారిగా ఉన్న కాకినాడ సిటీ వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి కుటుంబం పాత్రపై మరింత లోతుగా ఆరా తీయబోతోంది. ఈ మేరకు ద్వారంపూడి కుటుంబం రేషన్ బియ్యాన్ని ఏవిధంగా విదేశాలకు అడ్డగోలుగా ఎగుమతి చేసిందనేదానిపై మంగళవారం కేబినెట్‌లో సుదీర్ఘ చర్చకు వచ్చింది. ద్వారంపూడి కుటుంబం రేషన్‌బియ్యాన్ని రూ.12కి కొనుగోలు చేసి రూ.43కి విదేశాలకు విక్రయించిన విషయాన్ని మంత్రి నాదెండ్ల కేబినెట్‌కు వివరించారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేయాలని సీఎం చంద్రబాబును కోరారు. ఈ నేపథ్యంలో ద్వారంపూడి బియ్యం అక్రమాలను పునాదులతో సహా కదిల్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అయితే తదుపరి నిర్వహించే కేబినేట్ సమావేశం నాటికి ద్వారంపూడి కుటుంబం బియ్యం అక్రమాలపై నిగ్గు తేల్చేందుకు విధివిధానాలతో రావాలని సీఎం ఆదేశించారు. ఈ నేపథ్యంలో సీఐడీ విచారణకు త్వరలోనే రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించే అవకాశం ఉంది.

- కాకినాడ నుంచి విదేశాలకు రేషన్ బియ్యం ఎగుమతి మాఫియాపై ఉక్కుపాదమే
- గత అయిదేళ్ల అక్రమాలను మరింత లోతుగా తవ్వుతోన్న కూటమి ప్రభుత్వం
- ఇప్పటికే రూ.800 కోట్లకుపైగా రేషన్ బియ్యం అక్రమంగా ఎగుమతి అయినట్టు అంచనా
- ప్రధాన సూత్రధారిగా మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి కుటుంబం పాత్రపై లోతుగా ఆరా
- మంగళవారం నాటి కేబినెట్ సమావేశంలో ద్వారంపూడి బియ్యం అక్రమాలపై చర్చ
- రేషన్ బియ్యాన్ని ద్వారంపూడి కిలో రూ.43కి విదేశాలకు విక్రయించినట్టు చెప్పిన మంత్రులు
- దీనిపై సమగ్ర దర్యాప్తు చేయించాలని సీఎం చంద్రబాబును కోరిన మంత్రి నాదెండ్ల
- ఈ స్కాంపై ఏం చేయాలో వచ్చే కేబినెట్‌కు విధివిధానాలతో రావాలని సీఎం ఆదేశం
- ద్వారంపూడి మాఫియాపై నిగ్గు తేల్చడానికి త్వరలో సీఐడీ విచారణకు ఆదేశించే అవకాశం

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ కేంద్రంగా వందల కోట్ల విలువైన రేషన్ బియ్యం యాంకరేజ్ పోర్టు నుంచి విదేశాలకు భారీగా తరలిపోయింది. ప్రధానంగా వైసీపీ గత అయిదేళ్ల పాలనలో ఇది మరింత రెట్టింపు అయింది. సీఎం జగన్‌కు సన్నిహితుడిగా పేరొందిన కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి అప్పట్లో అధికారం అండతో చెలరేగిపోయారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో తమ మనుషుల ద్వారా రేషన్ బియ్యాన్ని కిలో రూ.15కి కొనుగోలు చేసి కాకినాడ, చుట్టుపక్కల తన మిల్లులు, గోదాముల్లో ఈ బియ్యం లక్షల మెట్రిక్ టన్నుల్లో నిల్వ చేశారనే ఆరోపణలు ఉన్నాయి. ఆనక ఆ బియ్యాన్ని తమ మిల్లుల్లో పాలిష్ చేసి ఆఫ్రికా దేశాలకు ఎగుమతి చేశారు. కిలో బియ్యాన్ని అక్కడ రూ.43 చొప్పున విక్రయిస్తూ కోట్లకు కోట్లు సంపాదించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్నాళ్లు ఎమ్మెల్యేగా ద్వారంపూడి, పౌరసరఫరాల సంస్థ చైర్మన్‌గా ద్వారంపూడి తండ్రి భాస్కరరెడ్డి, రాష్ట్ర రైస్‌మిల్లర్ల సంఘం అధ్యక్షుడిగా ద్వారంపూడి సోదరుడు వీరభద్రారెడ్డి ఈ ముగ్గురు కలిసి ఆడింది ఆట పాడింది పాటగా చేశారు. ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా రేషన్ బియ్యాన్ని అతి తక్కువ ధరకు కొనుగోలు చేసి మిల్లుల్లో పాలిష్ చేసి విదేశాలకు విక్రయించేశారు. ఈ క్రమంలో అధికారం చేతిలో ఉండడంతో ద్వారంపూడికి ఎక్కడా అడ్డు లేకుండాపోయింది. రేషన్‌బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుంటే కనీసం ఎక్కడా దాడులు లేవు. మిల్లులు, గోదాముల్లో లక్షల టన్నుల్లో ఈ బియ్యాన్ని నిల్వచేసినా ఏరోజు జాయింట్ కలెక్టర్లు, పౌరసరఫరాల సంస్థ అధికారులు కనీసం కన్నెత్తి చూడలేదు. దీంతో ఏంచేసినా ద్వారంపూడికి చెల్లిపోయింది. చెప్పాలంటే మిల్లులు, మిల్లర్లు, అధికారులు, అధికారం అంతా ద్వారంపూడి కుటుంబం చేతిలో ఉండడంతో రేషన్ బియ్యాన్ని వందల కోట్లలో బొక్కేశారు. అటు కాకినాడ యాంకరేజ్ పోర్టును దారికి తెచ్చుకుని ద్వారంపూడి కుటుంబం భారీ స్థాయిలో రేషన్ బియ్యాన్ని విదేశాలకు అమ్మేసింది. చివరకు ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా ఉండడంతో ద్వారంపూడి ఆఫ్రికా దేశాల్లో బియ్యం గోదాములు కూడా నిర్మించినట్టు తెలిసింది. తాజాగా ప్రభుత్వం మారడంతో ద్వారంపూడి రేషన్ బియ్యం మాఫియాలపై కూటమి ప్రభుత్వం ఉచ్చు బిగించింది. పేదలకు అందాల్సిన బియ్యాన్ని కారుచౌకగా బొక్కేసి అమ్మేసుకున్న వైనంపై స్వయంగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ పిడికిలి బిగించారు. గత నెలలో నేరుగా కాకినాడకు వచ్చి రెండు రోజులపాటు కాకినాడ యాంకరేజ్‌పోర్టు, బియ్యం గోదాముల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. దాదాపు 51 వేల మెట్రిక్ టన్నుల బియ్యం సీజ్ చేయించి ల్యాబ్ టెస్టులకు పంపగా ఇందులో 13 వేల మెట్రిక్ టన్నులు రేషన్ బియ్యం ఉన్నట్టు తేలింది. ఈ నేపథ్యంలో బియ్యం మాఫియా అంతు తేల్చడానికి మరింత లోతుగా వెళ్లాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అయిదేళ్లలో ఏ ఒక్క రైసుమిల్లులో అధికారులు తనిఖీలు చేయకపోవడం కూడా రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోవడానికి ఓ కారణంగా మారిందని కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ ఇటీవల వివరించారు. మరోపక్క మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి రేషన్ బియ్యం మాఫియాను ఏవిధంగా నడిపించారో మంత్రి నాదెండ్ల కూడా అధికారికంగా ప్రకటించారు. దీని వెనుక ఓ అయిదుగురు ఐపీఎస్‌ల పాత్ర కూడా ఉందని వెల్లడించారు.



కాకినాడలో గొడౌన్లలో ఉంచిన రేషన్ బియ్యాన్ని ఇటీవల తనిఖీ చేసిన పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్

## సీఐడీ విచారణకు రంగం సిద్ధం...

కాకినాడ కేంద్రంగా ద్వారంపూడి రేషన్ మాఫియాపై ఇప్పటికే మంత్రి నాదెండ్ల నివేదిక సిద్ధం చేయించారు. ఆయన ఏ విధంగా అక్రమాలకు పాల్పడ్డారు.. ఆయన కుటుంబం పాత్ర.. ఇటీవల సీజ్ చేసిన బియ్యంలో రేషన్ బియ్యం ఉన్నట్టు నిర్ధారణ కావడం వంటి వివరాలను మంగళవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో మంత్రి నాదెండ్ల కేబినెట్ దృష్టికి తీసుకువెళ్లారు. రేషన్ బియ్యాన్ని ద్వారంపూడి కుటుంబం భారీస్థాయిలో కారుచౌకగా కొని విదేశాలకు కిలో రూ.43కి విక్రయించిందని ముఖ్యమంత్రి చంద్రబాబుకు వివరించారు. అదే సమయంలో కొందరు మంత్రులు జోక్యం చేసుకుని ఆఫ్రికా దేశాల్లో ద్వారంపూడి గోదాముల అంశాన్ని కూడా కేబినెట్ దృష్టికి తీసుకువచ్చారు. అటు ద్వారంపూడి, ఆయన సోదరుడు, తండ్రి మొత్తం ఈ ముగ్గురు కలిపి మిల్లులు, మిల్లర్లు, అధికారులను చేతిలో ఉంచుకున్నారని, ఒకరకంగా పౌరసరఫరాల వ్యవస్థను గుప్పిట పెట్టుకున్నారని వివరించారు. దీంతో ద్వారంపూడి కుటుంబం రేషన్ మాఫియాపై సమగ్ర దర్యాప్తు చేయించాలని సీఎంను మంత్రి నాదెండ్ల కోరారు. ఈ నేపథ్యంలో తదుపరి జరగనున్న కేబినెట్ సమావేశం నాటికి ద్వారంపూడి రేషన్ బియ్యం మాఫియా దందాను లోతుగా నిగ్గుతేల్చి ఏవిధంగా శిక్షించాలనేదానిపై విధివిధానాలు తయారు చేసుకురావాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. దీంతో ద్వారంపూడి రేషన్ మాఫియా అంతు తేల్చడానికి ప్రభుత్వం అడుగులు వేస్తోందనే చెప్పాలి. కగా త్వరలో దీనిపై సీఐడీ విచారణకు ప్రభుత్వం ఆదేశించనున్నట్టు తెలుస్తోంది. తద్వారా మొత్తం మిల్లులు, మిల్లర్లు, కొందరు అధికారులు, ఓ అయిదుగురు ఐపీఎస్ అధికారుల పాత్రపై విచారణ జరగనుంది. అటు యాంకరేజ్ పోర్టు నుంచి విదేశాలకు బియ్యం ఎగుమతి లావాదేవీలను క్షుణ్ణంగా విచారించడం తద్వారా ద్వారంపూడి కుటుంబం ఎంత నొక్కిందనేది విచారణలో తేల్చే అవకాశం ఉంది.

# కాకినాడలో ఐదు అన్న క్యాంటీన్లు

**పాత వాటికి మరమ్మతులు.. ఆగస్టు 15 నుంచి ప్రారంభం**

సర్పవరం జంక్షన్/ కార్పొరేషన్ (కాకినాడ), జూలై 16: గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో నిరుపేదల కడుపు నింపిన అన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం మూసివేసింది. ఈ పథకం నిలుపుదల ద్వారా వేలాదిమంది నిరుపేదలు, కార్మికులు, కర్షకుల కడుపుకొట్టింది. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్ల పునరుద్ధరణకు రంగం సిద్ధమవుతోంది. జిల్లా కేంద్రమైన కాకినాడ సిటీకి జీవనోపాధి, భవన నిర్మాణ, పోర్టు తదితర వాటిల్లో కూలి పనుల కోసం నిత్యం వేలాది మంది వస్తుంటారు. చేతిలో డబ్బులు లేకపోవడం, ఇంటి వద్ద క్యారేజీ సమకూర్చలేని పరిస్థితుల్లో ఉన్నవారికి గతంలో టీడీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్ల ద్వారా అతి స్వల్ప ధరకే ఆహారం అందించేది. కాకినాడ రూరల్ నియోజకవర్గం పరిధిలో అప్పటి ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఆధ్వర్యంలో 2018లో బోట్‌క్లబ్‌లో అన్న క్యాంటీన్ భవనాన్ని నిర్మించగా, నాటి సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆధ్వర్యంలో నగర పరిధిలో మరో మూడు అన్న క్యాంటీన్లను నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అక్షయపాత్ర ఆధ్వర్యంలో సరఫరా చేసిన ఆహారాన్ని రూ.5కే ఉదయం అల్పాహారం, రూ.5కే మధ్యాహ్నం లంచ్, రాత్రిపూట రూ.5కే డిన్నర్ ద్వారా పేదలకు ఆహారం అందించేవారు. నిరుపేదల కోరిక మేరకు సర్పవరం, రమణయ్యపేట కొత్తూరు సెంటర్‌లో మరో రెండు అన్న క్యాంటీన్ల ఏర్పాటుకోసం అప్పటి స్థానిక ఎమ్మెల్యే శంకుస్థాపన కూడా చేశారు. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్లను మూసివేసింది. దాంతో నిరుపేదలకు ఆహారం అందించే బృహత్తర పథకం నిలిచిపోయింది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వీటిని తిరిగి ప్రారంభించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. దాంతో వీటిని ఆగస్టు 15 నాటికి తిరిగి ప్రారంభించేందుకు అధికారులు శరవేగంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుత సిటీ ఎమ్మెల్యే కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ప్రత్యేకంగా అన్నా క్యాంటీన్ల పథకం అమలుపై దృష్టి పెట్టారు.

### ఆగస్టు 10వ తేదీలోగా పనుల పూర్తికి ఆదేశం

జిల్లా కేంద్రమైన కాకినాడలో ఆగస్టు 15 నుంచి ఐదు ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను ప్రారంభించనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు చెప్పారు. మంగళవారం ఆయన ఎస్ఈ పి.సత్యకుమారి, ఇతర అధికారులతో కలిసి అన్న క్యాంటీన్లు ఉన్న ప్రాంతాలను సందర్శించారు. గతంలోనే ఉన్న ఈ అన్న క్యాంటీన్లను వినియోగంలోకి తెచ్చే ఏర్పాట్లను పర్యవేక్షించి అధికారులకు ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ జగన్నాథపురం అన్నమ్మగాటి, సంతచెరువు, వివేకానంద పార్కు, డెయిరీ ఫారం సెంటర్, బోట్‌క్లబ్ ప్రాంతాల్లో అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తున్నామని చెప్పారు. ప్రతిపాదిత ప్రాంతాల్లో ఉన్న ఈ అన్న క్యాంటీన్ల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇప్పటికే టెండర్లు పిలిచామని గురువారం నాటికల్లా వీటిని ఖరారు చేస్తామని కమిషనర్ చెప్పారు. అన్న క్యాంటీన్ల ఏర్పాట్లను ఎస్ఈ పి.సత్యకుమారి పర్యవేక్షణలో ఒక్కో అన్న క్యాంటీన్‌కు డీఈ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించి పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. ఆగస్టు 10వ తేదీలోగా పనులన్నీ పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్ఈ వెంకటరావు, ఈఈ మాధవి, డీఈ సుబ్బారావు, ఏఈ రమేష్‌బాబు ఉన్నారు.



పిఠాపురం మోహన్‌నగర్‌లో ఖాళీగా ఉన్న పార్కు స్థలం, ప్రభుత్వ భూమి

# ఖాళీ స్థలాలపై అక్రమార్కుల కన్నుపడింది..

**పరిరక్షించాలని స్థానికుల డిమాండ్**

పిఠాపురం, జూలై 16: అవన్నీ విలువైన ప్రభుత్వ భూములు. ఏళ్ల తరబడి ఖాళీ ఉండడంతో వాటిని గతంలో ఆక్రమించారు అక్రమార్కులు. అసలు ఎక్కడ ప్రభుత్వ భూములు ఉన్నాయో ప్రస్తుతం తెలియని పరిస్థితి. కొందరైతే రోడ్లను తమ స్థలాల్లో కలిపి వేసుకున్నారు. వీటిని గుర్తించి పరిరక్షించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పిఠాపురం పట్టణంలోని మోహన్‌నగర్ ఏర్పడి నాలుగు దశాబ్దాలు దాటింది. ఇక్కడ అప్పట్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేయగా వందల కుటుంబాలు గృహాలు నిర్మించుకుని ఇక్కడ జీవనం సాగిస్తున్నాయి. సామాజిక అవసరాల కోసం కేటాయించిన స్థలాలతోపాటు ప్రభుత్వ భూములు ఖాళీగా ఉన్నాయి. ఇదే అదనుగా వీటిని గతంలో కొందరు వ్యక్తులు వీటిని ఆక్రమించుకున్నారు. వీరిలో కొందరు వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టాలు పుట్టించేశారు. మోహన్‌నగర్ కాలనీ ఏర్పాటు సమయంలో పార్కుల కోసం ప్రభుత్వం రెండు స్థలాలు అప్పట్లో ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించింది. ఇందులో ఒక స్థలాన్ని కొందరు నేతలు ఆక్రమించుకున్నారు. ప్రస్తుతం ఈ స్థలాల విలువ రూ.కోట్లలో ఉంది. వీటికి కొందరు పట్టాలు సైతం తీసుకున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. మరోచోట పార్కు స్థలం, ప్రభుత్వ భూమి ఉన్నాయి. వీటిలో కొంతభాగం ఆక్రమణలకు గురైనట్టు చెబుతున్నారు. ప్రైవేటు చెరువు స్థలాన్ని చేర్చి ఉన్న ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమించుకున్నారు. ఇక్కడ రోడ్లు కోసం ప్రత్యేకించిన స్థలాలను ప్లాట్లుగా విభజించి విక్రయాలు జరిపేశారు. ఒక్కొక్కటిగా ప్రభుత్వ భూములు, పార్కులు, ఇతర అవసరాల కోసం కేటాయించిన స్థలాలు ఆక్రమణలు, కబ్జాలకు గురవుతున్నా, కొందరు అక్రమార్కులు వీటిని దర్జాగా విక్రయించేస్తున్నా రెవెన్యూ, మునిసిపల్ అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణల గురించి ఫిర్యాదులుచేసినా పట్టించుకోకపోగా ఆక్రమణదారులకే అధికారులు వత్తాసు పలికారని, ఇప్పటికైనా సమగ్ర సర్వే నిర్వహించి ప్రభుత్వ భూములు, పార్కుల స్థలాలను పరిరక్షించాలని కోరుతున్నారు.

# ఐదేళ్లూ.. దారిద్య్రం!



ఇది ఏడీబీ రోడ్డే.. ఈ రహదారంతా ఇంతేనండోయ్..

- ఏడీబీ రోడ్డుకు జగన్ రివర్స్ దెబ్బ
- ఏడేళ్లయినా పూర్తికాని వైనం
- ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ
- కూటమి రాకతో మళ్లీ కదలిక

గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్లూ జగన్ ఏం చేశారు.. ఎన్నికయ్యారు.. అనుభవించారు.. సంక్షేమ ముసుగు వేసి.. అభివృద్ధి, సమస్యలను పక్కన పడేశారు.. 'దారి'ద్ర్యం మిగిల్చారు. జగన్ ఐదేళ్ల పాలనకు ఈ రోడ్డే ఒక ఉదాహరణ. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. అయితే ఆ తరువాత వచ్చిన ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించింది. అయితే గత ప్రభుత్వ హయాంలో 25 శాతం పూర్తయిన పనులు ఆపేయాలని.. రివర్స్ టెండరింగ్ పేరుతో ఆదేశాలు జారీచేశారు. అంతే ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఐదేళ్లలో ఒక్కసారి ఆ రోడ్డు గురించి ఆలోచించలేదు.. ఇదీ 30 కిలోమీటర్ల మేర నిత్యం రద్దీగా ఉండే రాజానగరం-కాకినాడ ఏడీబీ రోడ్డు దుస్థితి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఏడీబీ రోడ్డుకు మోక్షం కలిగించాలని ప్రజలు కోరుతున్నారు.



టైర్లు పీపీ: రోడ్డుపై ఉన్న గోతిలో మునిగిన బస్ టైర్లు



అసలు రోడ్డేది: రోడ్డు కదా అని ధైర్యంగా వస్తే బురదలో దిగిన బైక్.. ఏడీబీ రోడ్డులో ఇటువంటివి సర్వసాధారణం

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

రాజానగరం నుంచి సామర్లకోట వరకూ కాకినాడ వెళ్లే ప్రధాన ఏడీబీ రోడ్డు నరకంగా మారింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంగా వదిలేయడంతో ఎటు చూసినా భారీ గోతులే. దీంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అసలే వర్షాకాలం కావడంతో మరింత అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డు నిర్మాణ పనులు ఆరంభించి ఏడేళ్లు అవుతున్నా ఇప్పటివరకూ కేవలం 35 శాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.

## 2017లో రోడ్డు పనులు ఆరంభం

విశాఖ- చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (వీసీఐసీడీపీ)లో భాగంగా రాజానగరం నుంచి సామర్లకోట వరకూ ఏడీబీ రోడ్డును నాలుగు లేన్లగా విస్తరించడానికి రూ.393 కోట్ల 43 లక్షల 81 వేల 264 అంచనాతో 2017లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం జీవో నంబర్ 328తో అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చింది. 30 కిలోమీటర్ల మేర అభివృద్ధి చేయాలని అప్పట్లో నిర్ణయించారు. బీఎస్ఆర్- బీఎస్‌సీపీఎల్ అనే జాయింట్ వెంచర్ సంస్థకు కాంట్రాక్టు ఇచ్చారు. 2021 ఫిబ్రవరి 12వ తేదీకి దీన్ని పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టారు. దీంతో భూసేకరణతోపాటు కొంత పనులు చేపట్టారు.

## ఐదేళ్లూ పట్టించుకోని వైసీపీ

ఏడీబీ రోడ్డు రెండు జిల్లాల పరిధిలో ఉంది. పొడవు 30 కిలోమీటర్లు. తూర్పుగోదావరి జిల్లాలో 16.29 కిలోమీటర్లు, కాకినాడ జిల్లా పరిధిలో 13.71 కిలోమీటర్లు పొడవు ఉంది. నాలుగు లేన్లుగా అభివృద్ధి చేయవలసి ఉంది. దీనికి మొత్తం 57.69 ఎకరాల భూమిని సేకరించాలి. టీడీపీ హయాంలోనే కాకినాడ జిల్లా పరిధిలో 23.58 ఎకరాలను సేకరించారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలో 34.11 ఎకరాలు సేకరించాల్సి ఉండగా కొంత మినహా మిగతాది సేకరించారు. పనులు ఆరంభించారు. 2019లో జరిగిన ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రావడంతో రోడ్డుకు గ్రహణం పట్టుకుంది. వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండర్స్ పేరిట కొద్దిరోజులు ఆపేసి.. ఎన్నికలకు సుమారు ఏడాదిన్నర ముందు అదే కాంట్రాక్టర్‌కు పనులు కొనసాగించమని చెప్పింది. కానీ చేసిన పనికి డబ్బులు ఇవ్వలేదు. మొత్తం రూ.44.12 కోట్లు సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్ ఉన్నాయి. దీంతో విసిగిపోయిన కాంట్రాక్టర్ మరో రూ.7.7 కోట్లు పనిచేసినా వాటి బిల్లులను సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేయలేదు. 2023 జూలైలో తనకు రావాల్సిన సుమారు రూ.52 కోట్ల బకాయిని చెల్లిస్తేనే రోడ్డు నిర్మాణ పనులు కొనసాగిస్తానని కాంట్రాక్టర్ తెలియజేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో నిర్మాణ పనులు మధ్యలో నిలిపివేశారు. ఇవాళ ఈ రోడ్డుపై ప్రయాణం నరకంగా మారింది.

## కూటమి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్?

రోడ్డును పూర్తి చేయడానికి చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇటీవల గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు చెబుతున్నారు. నిధులు రాకపోవడంతో ఇప్పటికే కాంట్రాక్టర్ ఎక్విప్‌మెంట్ తరలించుకుపోయాడు. సీఎం చంద్రబాబు పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో కాంట్రాక్టర్ ఇప్పుడిప్పుడే తిరిగి ఎక్విప్‌మెంట్‌ను తెచ్చే యోచనలో ఉన్నట్టు సమాచారం. ప్రస్తుతం ఇబ్బందిగా ఉన్న కల్వర్టులను బాగు చేస్తున్నారు. బహుశా ఆగస్టు తర్వాత రోడ్డు నిర్మాణంలో కదలిక వస్తుందనే ప్రచారం ఉంది. వర్షాలు తగ్గాక పనులు ఊపందుకునే అవకాశం ఉంది.



ఏపీఎస్పీలో సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న సతీష్‌కుమార్

# ఏపీఎస్పీ కమాండెంట్, జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్‌కు వీడ్కోలు సత్కారం

సర్పవరం జంక్షన్, జూలై16: కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ కమాండెంట్, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్‌కు బెటాలియన్ అధికారులు, సిబ్బంది ఘన వీడ్కోలు పలికారు. మంగళవారం రమణయ్యపేట ఏపీఎస్పీలో ఎడిషనల్ ఎస్పీ ఎల్.అర్జున్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లాకు బదిలీపై వెళుతున్న సతీష్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సిబ్బంది గౌరవవందనం స్వీకరించారు. అనంతరం సన్మానగ్రహీత సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా ఎస్పీగా, బెటాలియన్ కమాండెంట్‌గా విధులు నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఆరు నెలలపాటు కమాండెంట్‌గా ఉన్నానని, ఎన్నికల విధుల్లో పూర్తిస్థాయిలో సిబ్బందికి సేవలు అందించలేకపోయాయని, భవిష్యత్తులో కమాండెంట్‌గా వచ్చి అభివృద్ధి, సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ మురళీకుమార్, సాంబయ్య, సత్యనారాయణ, యూనిట్ మెడికల్ ఆఫీసర్ సునీల్‌కుమార్, ఆర్ఐలు సురేష్‌బాబు, రవిశంకర్, రామకృష్ణ, రాము, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ హయాంలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అండతో
దళితుల భూమి కబ్జా - 7లో

సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే కొండబాబు - 8లో

ఒడిసాకు చెందిన వివాహిత హత్య - 7లో

కాంక్రీట్ మిక్చర్‌లో పడి యువకుడి దుర్మరణం - 7లో

# ఉచిత ఇసుక కేటాయింపులో మార్గదర్శకాలు పాటించాలి

**కొవ్వూరు, తాళ్లపూడి గోదావరి బండ్ మార్గంలో సీసీ కెమెరాలు**

**జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో కలెక్టర్ పి.ప్రశాంతి**

రాజమహేంద్రవరం, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక కేటాయింపులో ప్రభుత్వ మార్గదర్శకాలు కచ్చితంగా పాటించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. రాజమహేంద్రవరంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన జిల్లా ఇసుక కమిటీ సమావేశంలో చైర్మన్, కలెక్టర్ ప్రశాంతి మాట్లాడారు. జిల్లా లోని 7 ఇసుక పాయింట్లు, 31 డిస్టిలేషన్‌పాయింట్ల వద్ద ప్రస్తుతం 3,77,350.50 మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందని తెలిపారు. భవన నిర్మాణాలు, ప్రభుత్వ ప్రాధాన్యత పనులకు ఉచిత ఇసుక కేటాయించాలన్నారు. బల్క్ కేటాయింపుల విషయంలో జిల్లా స్థాయి కమిటీ నిర్ణయం మేరకే కేటాయించాలన్నారు. ఇతర జిల్లాల విషయంలో ఆయా జిల్లాల కలెక్టర్, ఆయా జిల్లాల ఇసుక కమిటీ సిఫారసులను అనుసరించే కేటాయింపులు ఉంటాయని చెప్పారు. దీనికి సంబంధించిన విజిలెన్స్ ఆయా జిల్లాల పరిధిలోనే ఉంటుందన్నారు. జిల్లాలో అవసరాలకు అనుగుణంగా ఇసుక లభ్యత ఉండేలా పర్యవేక్షించాలన్నారు. గోదావరి ఉధృతి, ప్రతికూల పరిస్థితుల వల్ల స్టాక్ పాయింట్ల వద్ద నిల్వల కంటే ముందు డిస్టలేషన్ పాయింట్ల వద్ద ఉన్న నిల్వలను గుర్తించి కేటాయించాలన్నారు. నదీ పరీవాహక ప్రాంతాల్లోని ఇసుక నిల్వలను అంచనా వేయాలని అధికారులను ఆదేశించారు. వ్యక్తిగత నిర్మాణాలకు ఆధార్, ప్లాన్ పంచాయతీ అధికారి ధ్రువీకరణ పత్రాలు అవసరమని తెలిపారు. సబ్-కలెక్టర్, ఆర్డీవోల వ్యక్తిగత పర్యవేక్షణ ఉండాలన్నారు. కొవ్వూరు, తాళ్లపూడి గోదావరి బండ్ మార్గంలో 360 డిగ్రీ సీసీ కెమెరాల పర్యవేక్షణ చేపట్టాలన్నారు. రాజమహేంద్రవరం మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోనూ, ఇతర ప్రైవేట్ ఏజెన్సీలకు చెందిన బల్క్ కేటాయింపులకు ఏడు ప్రతిపాదనలు వచ్చాయని, వాటికి నిబంధనలు అనుసరించి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి జేసీ కె.దినేష్‌కుమార్, సబ్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాత్సవ, డీఆర్వో జి.నరసింహులు, ఆర్డీవో ఎ.చైత్రవర్షిణి, మైన్స్ ఏడీ ఎం.సుబ్రహ్మణ్యం, సెబ్ ఏఎస్పీ వి.సోమశేఖర్, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి వై.శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ జి.కాశీ విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## బైక్‌ను ఢీకొన్న కారు

**వృద్ధుడి దుర్మరణం**

ఏలేశ్వరం, జూలై 16: కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం పేరవరం జంక్షన్ వద్ద రోడ్డు ప్రమాదంలో మంగళవారం ఓ వ్యక్తి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపురం మండలం గుడివాడకు చెందిన కనపర్తి సూర్యుడు (80) ఫైనాన్స్ నిమిత్తం మోటార్ సైకిల్‌పై పేరవరం వెళ్లి తిరిగి వెళ్తుండగా జాతీయ రహదారి జంక్షన్‌లో విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపుగా వెళ్తున్న కారు స్పీడుగా వచ్చి మోటార్ సైకిల్‌ను ఢీకొనడంతో సూర్యుడు అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. సూర్యుడు అల్లుడు జి.సుబ్బిరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

## ఒడిసాకు చెందిన వివాహిత హత్య

**భర్తే చంపి ఉంటాడనే అనుమానాలు**

సర్పవరం జంక్షన్, జూలై 16: కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సర్పవరం శివారు భావనారాయణపురంలో ఒడిసాకు చెందిన వివాహిత హత్యకు గురైంది. భర్తే ఈ హత్యకు పాల్పడి ఉంటాడని బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఘటన జరిగిన తర్వాత మూడేళ్ల కుమారుడితో ఆమె భర్త పరారవ్వడంతో అతనే హత్యకు పాల్పడి ఉంటాడని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. వివరాల్లోకెళితే ఒడిసా గంజాం జిల్లా కైరాపుటికి చెందిన రిటంగేల్ గౌడ స్వైయిన్ (31), నీలు స్వైన్‌లు భార్యాభర్తలు, వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. జీవనోపాధి కోసం మూడు నెలల కిందట ఒడిసా రాష్ట్రం నుంచి కాకినాడ రూరల్ మండలం సర్పవరం శివారు భావనారాయణపురంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. ఇక్కడ ఉంటున్న బంధువులతో కలిసి భర్త సీలింగ్ ఇతర కూలి పనులకు వెళ్తున్నాడు. మంగళవారం ఉదయం భార్య గౌడ స్వైన్‌కు సోదరి ఫోన్ చేసినా ఎత్తకపోవడంతో తన భర్తను మరదలి ఇంటికెళ్లి చూచి రమ్మని పంపించింది. ఇంట్లో గౌడ స్వైన్ బోర్లా కింద పడి ముక్కులో నుంచి రక్తస్రావంతో విగతజీవిగా పడి ఉండటాన్ని గుర్తించి సోదరికి సమాచారం అందించగా ఆమె వచ్చి పరిశీలించి మృతి చెందినట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చింది. సంఘటనా స్థలానికి కాకినాడ ఎస్‌డీపీవో కె.హనుమంతరావు, సర్పవరం ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్‌లు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆధారాలు కోసం పోలీసు జాగిలాలను రప్పించారు. భార్యభర్తల మధ్య వివాదాలు ఏమన్నాయా ఉన్నాయా, భర్త ఎక్కడ ఉన్నాడంటూ స్థానికుల నుంచి పోలీసులు సమాచారం సేకరించారు. మూడేళ్ల కుమారుడితో భర్త పరారైనట్లు బంధువులు పోలీసులకు తెలిపారు. భర్తే హత్య చేసి పరారై ఉంటాడని బంధువులు అనుమానం వ్యక్తం చేశారు. గౌడ స్వైయిన్ సోదరి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో వైఆర్‌కే శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకి తరలించారు.



గౌడ స్వైయిన్ మృతదేహం, కుమారుడితో(ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

## ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీ

**ఒకరి మృతి..ఇద్దరికి తీవ్రగాయాలు**



మృతిచెందిన గంగయ్య

వరరామచంద్రాపురం, జూలై 16: మండలంలోని రాయిగూడెం, వీఆర్‌పురం మధ్యలో పూచిక వాగు దగ్గర మంగళవారం రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతిచెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. మండలంలోని రాయిగూడెం గ్రామానికి చెందిన నూపా గంగయ్య (40) మరో మహిళ ద్విచక్ర వాహనంపై వీఆర్‌పురం వస్తుండగా, కొటారుగొమ్ము గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంపై వీఆర్‌పురం నుంచి కొటారిగొమ్ము వెళ్తున్న క్రమంలో రాయిగూడెం, వీఆర్‌పురం మధ్యలో పూచిక వాగు దగ్గర రెండు బైక్‌లు ఢీకొన్నాయి. ఈ సంఘటనలో రాయగూడెం గ్రామానికి చెందిన నూపా గంగయ్య అక్కడికక్కడే మృతిచెందగా కొటారిగొమ్ము గ్రామానికి చెందిన ఇద్దరి యువకులు తీవ్రగాయాల పాలయ్యారు. అటుగా వెళ్తున్న వారు జరిగిన ప్రమాద విషయాన్ని 108 వాహనానికి తెలియజేయగా, అంబులెన్సు అక్కడకు చేరుకొని గాయాలైన వారిని, మృతదేహాన్ని కోతులగుట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించారు.

## దొంగతనాల కేసులో నిందితుడి అరెస్టు

**రూ.11 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం**

మామిడికుదురు, జూలై 16: వరుస దొంగతనాలకు పాల్పడుతున్న బీఆర్ అంబేడ్కర కోనసీమ జిల్లా రాజోలు మండలం కాట్రేనిపాడు గ్రామానికి చెందిన రేకపల్లి నాగరాజును అరెస్టు చేసినట్టు నగరం ఎస్ఐ పి.సురేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం నాగరాజుపై వివిధ పోలీసుస్టేషన్లలో తొమ్మిది దొంగతనం కేసులు ఉన్నాయని, ఇటీవల మగటపల్లి గ్రామంలో ఓ దొంగతనం చేయగా అదుపులోకి తీసుకుని విచారించగా మొత్తం దొంగతనాల వివరాలు బయటపడినట్టు తెలిపారు. నిందితుడు ఉపాధి నిమిత్తం తమిళనాడులో కొబ్బరి ఒలుపు చేస్తుంటాడని, ఇటీవల జరిగిన ఎన్నికల నిమిత్తం స్వగ్రామం వచ్చి ఈ దొంగతనాలకు పాల్పడ్డాడని ఎస్ఐ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి రూ.10 లక్షల 20 వేలు విలువైన 160 గ్రాముల బంగారం, రూ.80 వేలు నగదుతో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని అరెస్టుచేసి రాజోలు కోర్టుకు రిమాండ్ నిమిత్తం మంగళవారం పంపిస్తున్నట్టు తెలిపారు. ఈ కేసులో చాకచక్యంగా దర్యాప్తుచేసి నిందితుడిని అరెస్టు చేయడంలో కీలక పాత్ర పోషించిన నగరం ఎస్ఐ సురేష్, హెచ్‌సీ బొక్కా శ్రీనివాస్, పీసీ డి.చిరంజీవి, నగరం పోలీస్‌స్టేషన్ సిబ్బందిని పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్ అభినందించి రివార్డుకు సిఫార్సు చేశారు.



నిందితుడి వివరాలు తెలియజేస్తున్న ఎస్ఐ సురేష్

### కాంక్రీట్ మిక్చర్‌లో పడి యువకుడి దుర్మరణం

సామర్లకోట, జూలై 16: సామర్లకోట మండలం అచ్చంపేట సమీపాన ఒక ప్రైవేట్ కాంక్రీట్ రడీ మిక్స్ సంస్థలో మంగళవారం రాత్రి ప్రమాదవశాత్తూ కాంక్రీట్ మిక్చర్‌లో పడి పిఠాపురం మండలం లక్ష్మీనరసాపురం గ్రామానికి చెందిన బుర్రా సత్య సాయి(18)(సత్తిబాబు) అక్కడికక్కడే మృతి చెందాడు. యువకుని శరీరం నుజ్జునుజ్జు అయ్యింది. గుర్తించేందుకు వీలులేని స్థితికి చేరింది. సమాచారం అందిన వెంటనే సామర్లకోట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై ఆరా తీశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.



సత్యసాయి(ఫైల్)

వైసీపీ హయాంలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా అండతో

## దళితుల భూమి కబ్జా

**తొండంగి మండలం కోదాడలో ఉప్పు చెరువు భూముల్లో పాగా**

**మాజీ మంత్రి దాడిశెట్టి, ఆయన మామ అండతో కబ్జా చేశారని దళితుల ఆరోపణ**

**శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల ఆదేశాలతో టీడీపీ బృందం భూ పరిశీలన**



భూములను పరిశీలిస్తున్న టీడీపీ బృందం

తొండంగి, జూలై 16: మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, ఆయన మామ అండదండలతో తాము సాగు చేసుకుంటున్న భూములు కబ్జాకు గురయ్యాయని తొండంగి మండలంలో మూడు గ్రామాల దళితులు శాసన మండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు దృష్టికి తీసుకురావడంతో ఆయన ఆదేశాలతో మంగళవారం టీడీపీ బృందం కబ్జాకు గురైన భూములను పరిశీలించింది. కబ్జా కోరల్లో ఉన్న ఉప్పు చెరువు భూములను టీడీపీ నేతలు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి అబ్బాయి, కోడ వెంకటరమణ తదితరులతో కూడిన బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా అక్కడకు మూడు గ్రామాలకు చెందిన దళితులు వచ్చి టీడీపీ నేతలకు గోడు చెప్పుకున్నారు. ఉప్పు చెరువు భూములు వైసీపీ పాలనలో కబ్జాకు గురయ్యాయని వారి కబంధ హస్తాల నుంచి వాటిని విడిపించి తమకు కేటాయించాలని కోరారు. చెరువు ప్రాంతంలో ఉన్న సుమారు 80 ఎకరాల భూమి నీటి తెప్పగా ఉండేదని దీనిని దశాబ్దాలుగా దళితులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. గత వైసీపీ పాలనలో మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, ఆయన మామ అండదండలతో కొందరు ఈ భూములను కబ్జా చేశారన్నారు. తప్పుడు రికార్డులు సృష్టించి రెవెన్యూ రికార్డుల్లో తమ పేరున ఆన్‌లైన్ చేయించుకున్నారన్నారు. ఆక్రమించిన భూముల్లో చేపల చెరువులు తవ్వుతుండగా అడ్డుకున్న తమను బలవంతంగా పోలీసులతో ఖాళీ చేయించారని, తమపై పోలీసు కేసులు పెట్టారని వాపోయారు. చేపల చెరువుల వ్యర్థాలు చెరువులో కలవడం వల్ల 16 గ్రామాలకు సరఫరా అవుతున్న నీరు కలుషితమవుతోందన్నారు. దీని వల్ల డయేరియా వంటి వ్యాధులు ప్రబలి కొమ్మనాపల్లిలో పలువురు మృతి చెందడంతో పాటు వందల మంది వ్యాధి బారిన పడ్డారన్నారు. దీని వలన ప్రజల ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నేతలకు వినతి పత్రం అందించారు. దళిత నాయకులు బూర్తి కృష్ణ, బూర్తి సింహాచలంతో పాటు టీడీపీ నాయకులు సాధనాల నూకరాజు,కొయ్యా రామకేశవ, పిర్ల శివ తదితరులు ఉన్నారు. ఇదిలా ఉంటే వివాదానికి సంబంధించిన సమగ్ర సమాచారంతో, రికార్డులతో హాజరు కావాల్సిందిగా యనమల రామకృష్ణుడు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కబ్జాకు గురైన భూములను విడిపించి దళితులకు న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ఏజెన్సీ చోడవరంలో పేకాట డెన్

**ఆదివాసీల ఆవాసాల్లో**
**దర్జాగా పేకాట**
**పేకాట శిబిరంలో**
**విలాసవంతమైన సౌకర్యాలు**
**చక్రం తిప్పుతున్న**
**తెలంగాణ పేకాట నిర్వాహకులు**

ఎటపాక, జూలై 16: ఎటపాక మండలం, చోడవరం గ్రామం నుంచి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో అడొక మారుమూల ప్రాంతం. అక్కడ పంట పొలాల మధ్య సుమారు మూడు గిరిజన కుటుంబాలు నివాసముంటున్నాయి. ఆ ప్రాంతంపై తెలంగాణ పేకాట నిర్వాహకుల కన్నుపడింది. ఇంకేముందు విలాసవంతమైన పేకాట జూద శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో గత ఐదారు రోజులు నుంచి దర్జాగా పేకాట జూదాన్ని నిర్వహిస్తున్నారు. గిరిజనుడికి చెందిన రెండు గోదాములను అద్దెకు తీసుకుని, దానిని పేకాట డెన్‌గా మార్చారు. పేకాట నిర్వాహకులు సాయంత్రం వేళ నుంచి తెల్లవార్లు పేకాట శిబిరాన్ని నిర్వహిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. లోపల టేబుళ్లను ఏర్పాటు చేసుకుని మూడు ముక్కలాట క్రీడను యథేచ్ఛగా ఆడిస్తున్నారు. రోజుకు రూ.వేలల్లో చేతులు మారుతున్నట్లు తెలుస్తోంది. అయితే తెలంగాణలోని బూర్గంపాడు, భద్రాచలం పట్టణాలకు చెందిన పేకాట నిర్వాహకులు ఈ శిబిరాన్ని నిర్వహిస్తూ చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. పేకాట శిబిరంలో ఆటగాళ్లకు విలాసవంతమైన వసతులను సైతం ఏర్పాటు చేస్తున్నారు. గదుల్లో ఏసీలు, ఫ్యాన్లు అమర్చుతూ జూదం సాగిస్తున్నారు. ఇక్కడే మందు, ముక్క అనేక సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. దీంతో తెలంగాణ, ఏపీ ప్రాంతాల నుంచి జూదగాళ్లు ఇక్కడకు పరుగులు తీస్తున్నారు. ఆటగాళ్లు జూదంలో పాల్గొని జేబులు ఖాళీ చేసుకొని నిరాశగా వెళ్లిపోతున్నారు. కాగా ఇంత వ్యవహారం జరుగుతున్నా పోలీసులు ఈ వైపు కన్నెత్తి కూడా చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ విషయమై ఎస్ఐ పార్థసారథిని వివరణ కోరగా మంగళవారం సాయంత్రం శిబిరంపై దాడి చేశామన్నారు. అయితే పేకాటరాయుళ్లు అక్కడ నుంచి పరారయ్యారన్నారు. ఫర్నీచర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పేకాట శిబిరంపై నిరంతరం పర్యవేక్షణ ఉంటుందని కఠినచర్యలు తీసుకుంటామని చెప్పారు.

## నిలకడగా గోదావరి నీటి మట్టం

ధవళేశ్వరం, జూలై 16: ధవళేశ్వరం వద్ద గోదావరి నీటి మట్టం నిలకడగా కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రానికి కాటన్ బ్యారేజ్ 4 ఆర్మ్‌లలో ఉన్న 175 గేట్లకుగాను 130 గేట్లను 20మిల్లీమీటర్ల మేరపైకి ఎత్తి 78,791 క్యూసెక్కుల జలాలను దిగువకు విడిచి పెడుతున్నారు. నీటి మట్టం 10.35 అడుగులుగా నమోదయింది. వ్యవసాయ అవసరాల కోసం తూర్పుడెల్టాకు 3వేల క్యూసెక్కులు, మధ్యడెల్టాకు 1700క్యూసెక్కులు, పశ్చిమడెల్టాకు 4వేల క్యూసెక్కులు చొప్పున సాగునీటిని విడుదల చేస్తున్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన ఐటీడీఏ పీవో

వరరామచంద్రాపురం, జూలై 16: మండల కేంద్రమైన వీఆర్ పురంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను చింతూరు ఐటీడీఏ పీఓ కావూరి చైతన్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పీవో చైతన్య, ఎంఈవో లక్ష్మీనారాయణ, కళాశాల అధ్యాపకులతో మాట్లాడి కళాశాలలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలోనే జనసేన మండల అధ్యక్షుడు ములకాల సాయికృష్ణ మాట్లాడుతూ హాస్టల్ సదుపాయం ఉంటే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని, కళాశాలలో తాగునీటి సౌకర్యం కల్పించాలని పీవో దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. రాబోవు గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకుని తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలు, పునరావాస కేంద్రాల నిర్వహణ మొదలగు అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ మౌలానాఫాజిల్, జడ్పీటీసీ వాళ్ల రంగారెడ్డి, ఎస్ఐ నాగరాజు, ఆర్ఐ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ హరీష్‌మాధుర్

## ఓఎన్జీసీ రాజమండ్రి అసెట్ అభివృద్ధికి పూర్తి సహకారం

**తొలిసారిగా రాజమండ్రి అసెట్ కార్యాలయాలను సందర్శించిన ఎంపీ హరీష్‌మాధుర్**

రాజమహేంద్రవరం సిటీ, జూలై 16 : ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్, అమలాపురం రీజియన్ల అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని అమలాపుం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. ఎంపీ అయ్యాక తొలిసారిగా ఓఎన్‌జీసీ రాజమండ్రి అసెట్‌ను మంగళవారం సందర్శించారు. ఎంపీకి అసెట్ మేనేజరు శాంతనుదాస్ బృందం ఘనంగా స్వాగతం పలికారు. తొలుత అసెట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మగాంధీ విగ్రహాలకు ఎంపీ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అటుపై ఆవరణలో మొక్కను నాటారు. కాన్ఫరెన్స్ హాలులో రాజమండ్రి అసెట్ కార్యకలాపాలకు సంబంధించి సంక్షిప్త ప్రదర్శనను ఎంపీ తిలకించారు. భూసేకరణ, పైప్‌లైన్ వేయడం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఓఎన్‌జీసీ అసెట్ సీనియర్ అధికారులు, కలెక్టివ్ పాల్గొన్నారు.




పోలీసుల సంరక్షణలో ఉన్న యువతి

## నాలుగు నెలలు తర్వాత క్షేమంగా ఇంటికి..

సామర్లకోట, జూలై 16: సామర్లకోట రైల్వే పోలీసులు రాజోలు రాజేశ్వరి అనే యువతిని ఆమె తల్లిదండ్రులకు మంగళవారం క్షేమంగా అప్పగించారు. సామర్లకోట రైల్వే పోలీసులు అందించిన సమాచారం మేరకు మెదక్ జిల్లా మూసాయిక్‌పేట మండలం పోతనపల్లి గ్రామానికి చెందిన రాజోలు బాలరాజు కుమార్తె అయిన రాజేశ్వరి ఇంటి నుంచి ఫిబ్రవరి 2024 నెలలో వెళ్లిపోగా రాజేశ్వరి తల్లి సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు అప్పుడే ఫిర్యాదు చేశారు. ఆమె ఆచూకీ కోసం అప్పటినుంచీ సికింద్రాబాద్ రైల్వే పోలీసులు గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం సామర్లకోట రైల్వే పోలీసులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అప్రమత్తం చేయడంతో సామర్లకోట రైల్వే పోలీసులు సామర్లకోట ప్లాట్‌ఫాంపై గాలించడంతో అనుమానాస్పదంగా తిరుగుతున్న రాజేశ్వరిని గుర్తించి సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రాజేశ్వరి బంధువులు సామర్లకోట చేరుకోవడంతో సామర్లకోట రైల్వే ఎస్ఐ లోవరాజు క్షేమంగా అప్పగించారు.

## ఆగస్టు 7 నుంచి భీమేశ్వరుని దర్శనం

ద్రాక్షారామ, జూలై 16: ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో ఆగస్టు 7 నుంచి భీమేశ్వర స్వామి, మాణిక్యాంబ అమ్మవారి దర్శనం, పూజాధికాలకు భక్తులను అనుమతించనున్నట్లు ఆలయ ఈవో పి.టి.వి. సత్యనారాయణ మంగళవారం తెలిపారు. కేంద్ర పురావస్తుశాఖ ఆధ్వర్యంలో ప్రస్తుతం మూలవిరాట్ సంరక్షణ పనులు పూర్తికాగా అమ్మవారి గర్భాలయంలో కొన్ని అభివృద్ధి పనులు కొనసాగిస్తున్నారు. ఈనెల 20 నాటికి పనులు పూర్తి చేస్తామని కేంద్ర పురావస్తు శాఖాధికారులు ఆలయ ఈవోకు సమాచారం ఇచ్చినట్లు ఈవో పత్రికా ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులతో సమావేశం నిర్వహించామని ఆలయ బ్రహ్మలు సూచన మేరకు శూన్యమాసం అయినందున శ్రావణ శుద్ధ పౌర్ణమి రోజున వచ్చేనెల 5న సంప్రోక్షణ కార్యక్రమాలు ప్రారంభించి 6 వరకు నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. 7 ఉదయం నుంచి భీమేశ్వరస్వామి, మాణిక్యాంబ అమ్మవార్లను భక్తులు దర్శించేందుకు అనుమతి ఇస్తామన్నారు. అంతవరకు నంది మండపంలో బాలాలయంలో స్వామి,అమ్మవారి దర్శనం కొనసాగిస్తామని ఈవో తెలిపారు. స్వామివారి మూలవిరాట్ సంరక్షణ పనులు, ఇతర అభివృద్ధి పనులు నిమిత్తం దర్శనం ఏప్రిల్ 24 నుంచి నిలిపివేసిన సంగతి తెలిసిందే.

## టైప్ రైటింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి

కాకినాడ సిటీ, జులై 16 : రాష్ట్రవ్యాప్తంగా 35 కేంద్రాలలో ఈ ఏడాది సెప్టెంబర్ 28, 29 తేదీల్లో ఆంధ్రప్రదేశ్ స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ బోర్డు నిర్వహించే టైప్ రైటింగ్ పరీక్షలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ టైప్ రైటింగ్ అండ్ షార్ట్‌హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్స్ అసోసియేషన్ రీజనల్ కార్యదర్శి, కాకినాడ సెంటర్ అధ్యక్షుడు జి.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పై తేదీలలో ఇంగ్లీషు, తెలుగు భాషలలో లోయర్, హయ్యర్ గ్రేడ్, హైస్పీడ్ పరీక్షలను, ఇంగ్లీషు జూనియర్ గ్రేడ్ పరీక్షలను, హిందీలో లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలను నిర్వహిస్తారన్నారు. అదే విధంగా సెప్టెంబర్ 21,22 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా 6 కేంద్రాలలో షార్ట్ హ్యాండ్ పరీక్షలను నిర్వహిస్తారన్నారు. విజయవాడ షార్ట్ హ్యాండ్ కేంద్రాన్ని రద్దు చేసి, గుంటూరులో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ పరీక్షలకు ఇంకా 75 రోజుల సమయం ఉన్నందున స్థానికంగా ఉన్న టైప్ రైటింగ్ ఇన్‌స్టిట్యూట్స్ వారిని సంప్రదించి, సకాలంలో పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు.

## యువతుల ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

సామర్లకోట, జూలై 16: జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, సిడాప్ ఆధ్వర్యంలో సామర్లకోట టీటీడీసీ శిక్షణా కేంద్రంలో ఉచిత భోజన, వసతి సదుపాయాలతో యువతులకు ఉచిత ఉపాధి శిక్షణ అందిస్తున్నందున ఔత్సాహికులైన యువతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీరమణి, జిల్లా జాబ్స్ మేనేజర్ కిరణ్ మంగళవారం తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని నిరుద్యోగ యువతులకు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు సైతం నేరుగా కల్పిస్తామని చెప్పారు. శారీస్ పెయింటింగ్స్, ఎంబ్రాయిడరీ కోర్సులలో శిక్షణా తరగతులు 15 రోజుల పాటు ఉంటాయన్నారు. ఈ కోర్సులలో చేరే యువతుల వయస్సు 18 నుంచి 40 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. అలాగే వారి విద్యార్హత 8వ తరగతి ఆపైన ఉండాలన్నారు. జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల యువతులకు మాత్రమే ఈ అవకాశం ఉన్నందున సద్వినియోగం చేసుకోవాలని పీడీ శ్రీరమణి, కిరణ్ తెలిపారు.

## నవోదయ ప్రిన్సిపాల్‌గా సీతాలక్ష్మి

పెద్దాపురం, జూలై 16: స్థానిక జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్‌గా బి.సీతాలక్ష్మి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె పశ్చిమ గోదావరి జిల్లా పెదవేగి నవోదయలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. నూతనంగా బాధ్యతలను చేపట్టిన ప్రిన్సిపాల్ సీతాలక్ష్మీని విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ రామకృష్ణయ్య ఉపాధ్యాయులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.



## తాటిచెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి

కిర్లంపూడి, జూలై 16: కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలంలోని సింహాద్రిపురం గ్రామంలో జి.కుమార్ రాజు(29) అనే వ్యక్తి తాటిచెట్టు నుంచి పడి మృతిచెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..సోమవారం మధ్యాహ్నం కుమార్‌రాజు ఒక రైతు పొలంలో తాటి చెట్టు ఎక్కగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. హుటాహుటిన ప్రత్తిపాడు ప్రభుత్వాస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అయితే మంగళవారం చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో కుటుంబీకులు కాకినాడ జీజీహెచ్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ మేరకు కిర్లంపూడి ఎస్ఐ జబీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.



జీజీహెచ్ వద్ద బంధువుల ఆందోళన

## 'చిరుధాన్యాల సాగుతో ఆర్థికాభివృద్ధి'

శంఖవరం, జూలై 16: చిరుధాన్యాల సాగుతో రైతులు ఆర్థికాభివృద్ధి చెందవచ్చని మండల వ్యవసాయాధికారి పి.గాంధీ తెలిపారు. మండపం, జగ్గంపేట, వేలంగి, గ్రామాల్లో రైతులకు రాయితీపై చోడి (రాగి) విత్తనాల ను ఆయన అందజేశారు. సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతులు సాగు చేసిన పంటను మద్దతు ధరతో కొనుగోలు చేస్తామన్నారు. సలీం, శ్యాం, క్రాంతి, మణికంఠ, బిందురైతులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం


సమావేశంలో పాల్గొన్న చైర్‌పర్సన్ మంగతాయారు, కౌన్సిలర్లు

గొల్లప్రోలు, జూలై 16: పట్టణ పరిధిలోని సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని గొల్లప్రోలు నగరపంచాయతీ చైర్‌పర్సన్ గండ్రేటి మంగతాయారు ఆరోపించారు. గొల్లప్రోలు నగరపంచాయతీ కార్యాలయంలో వైసీపీ కౌన్సిలర్లతో కలిసి మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2021లో తమ పాలకవర్గం ఏర్పడిన నాటి నుంచి ప్రజాసమస్యలను పరిష్కరించడంతో పాటు పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామన్నారు. కొంతకాలంగా అధికారులు సమస్యలను తన దృష్టికి తీసుకురావడం లేదని, వారు పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న 18వ వార్డులో వాటర్‌ట్యాంకు నిరుపయోగంగా ఉండటానికి ప్రధాన కారణం అధికారుల్లో జవాబుదారీతనం లేకపోవడమేనన్నారు. నిరంతరం ప్రజల కోసమే పనిచేస్తామని తెలిపారు.

## 'కళాకారుల సమస్యలను పరిష్కరించాలి'

పిఠాపురం, జూలై 16: గ్రామీణ నాటక కళాకారుల సమస్యల పరిష్కారంపై రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించాలని శ్రీ నటరాజ రాష్ట్ర కళాకారుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో జరిగిన సంఘ సమావేశంలో ప్రతినిధులు మాట్లాడుతూ కళాకారుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. నాటకరంగానికి పునర్వైభవం కల్పించే దిశగా అడుగులు వేద్దామన్నారు. కాకినాడ జిల్లా గ్రామీణ నాటక కళాకారుల సంక్షేమం కోసం ఏర్పాటైన ఈ సంఘానికి గౌరవాధ్యక్షులుగా ముమ్మిడి తాతకొండ, వై.సూరిబాబు, అధ్యక్షుడిగా యడ్ల ప్రభాకరరావు, ఉపాధ్యక్షుడిగా కందుల పద్మనాభం, ప్రధాన కార్యదర్శిగా ఎలిశెట్టి భానుమతి, జాయింట్ సెక్రటరీగా ముల్లి వీరబాబు, కోశాధికారిగా నక్కా ఏసుబాబు, ముఖ్యసలహాదారులుగా కర్రి భాస్కరరావు, బర్రె సత్యనారాయణ ఎన్నికయ్యారు. సమావేశంలో నటులు గాది శ్రీనివాస్, టీఎస్ఎన్ రెడ్డి, పెదిరెడ్డి, డి.వెంకన్నబాబు, మేడిశెట్టి సుబ్రహ్మణ్యం తదితరులున్నారు.

## 'సచివాలయ భవనం నిర్మించేదెప్పుడు'

ప్రత్తిపాడు, జూలై 16: మండలంలో చినశంకర్లపూడిలో సచివాలయ భవనం నిర్మించేది ఎప్పుడు అని ఆ గ్రామస్తులు ప్రశ్నించారు. మంగళవారం సచివాలయ భవనం నిర్మంచే ప్రదేశం వద్ద నిరసన నిర్వహించారు. గ్రామ మాజీ ఉపసర్పంచ్ ఏపూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ సచివాలయ భవన నిర్మాణానికి 2022 అక్టోబరు 30న అప్పటి ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ శంకుస్థాపన చేశారని, ప్రభుత్వ నిధులు రూ.10లక్షలు నిధులు మంజూరై రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు చేపట్టలేదన్నారు. ఈ భవనం పేరుతో ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టాయని, దోచేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అక్రమాలపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

## 'పుస్తకావిష్కరణ సభను విజయవంతం చేయాలి'


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాజాసూరిబాబురాజు

పెద్దాపురం, జూలై 16: ఈనెల 21న తెలుగులో హరిశ్చంద్ర నాటకాలు, తులనాత్మక పరిశీలన పుస్తకావిష్కరణ సభను విజయవంతం చేయాలని మున్సిపల్ మజీ చైర్మన్ రాజాసూరిబాబురాజు అన్నారు. సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు డాక్టర్ జ్యోశ్యుల కృష్ణబాబు రచించిన ఈ పుస్తకావిష్కరణకు సంబంధించిన పోస్టర్లను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు తుమ్మల బాబు, సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షుడు రంగామోహన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ తదితరులు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## ఏఐఎఫ్‌టీయూ ధర్నా



గొల్లప్రోలులో ధర్నా నిర్వహిస్తున్న ఏఐఎఫ్‌టీయూ నాయకులు

గొల్లప్రోలు, జూలై 16: నియోజకవర్గానికి ఒక ఇసుక స్టాక్‌పాయింట్‌ను ఏర్పాటు చేసి అందరికీ ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తూ ఏఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో మంగళవారం గొల్లప్రోలు తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రజలపై రవాణాభారం అధికంగా పడకుండా ఉండేందుకు వారికి సమీపంలోనే స్టాకు పాయింట్లు ఉంటే మేలు జరుగుతుందని తెలిపారు. ధరను తక్కువగా నిర్ణయించాలని, అసలైన లబ్ధిదారులకే ఇసుక చేరేలా చూడాలని డిమాండ్ చేశారు. తహశీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఏఐఎఫ్‌టీయూ, ఏపీఆర్‌సీఎస్ జిల్లా అధ్యక్షులు కుంచే అంజిబాబు, వల్లూరి రాజబాబు, డి.నారాయణమూర్తి, గుడాల చార్లెస్, కేశవరపు వీరన్న, శివ, బొడ్డు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కు చెల్లించేందుకు సైకిల్‌పై విజయవాడకు..

కొత్తపల్లి, జూలై 16: పిఠాపురం నుంచి ఎమ్మెల్యేగా పవన్‌కల్యాణ్ విజయం సాధించడంతో మొక్కు చెల్లించేందుకు సైకిల్‌పై అమీనబాద్‌కు చెందిన పవన్ వీరాభిమాని ఎం.లక్ష్మణరావు మంగళవారం విజయవాడ కనకదుర్గమ్మ ఆలయానికి పయనమయ్యాడు. సైకిల్‌కు జనసేన జెండాలు, పవన్ ఫొటోలు ఏర్పాటు చేసుకొని కొత్తపల్లి,వాకతిప్ప, పిఠాపురం మీదుగా వెళ్లగా దారిపొడవునా జనసైనికులు, టీడీపీ నాయకులు అభినందించారు.


విజయవాడకు బయలుదేరిన లక్ష్మణరావు

## మురుగునీరు సరఫరాతో ఆందోళన

తాళ్లరేవు, జూలై 16: చినబొడ్డువెంకటాయపాలెం రక్షిత మంచినీరు మురుగుతో సరఫరాకావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వాటరు ట్యాంకు నిర్వహణ క్లోరినేషన్ బాగుండడం లేదని పాలెపు ధర్మారావు ఆరోపించారు. అధికారులు స్పందించి సక్రమమైన తాగునీరు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ ఎఈ మారుతీరావును వివరణ కోరగా చర్యలు చేపట్టామని తాగునీరు సక్రమంగానే సరఫరా అవుతుందన్నారు.


చినబొడ్డువెంకటాయపాలెంలో వచ్చిన మురుగునీరు

## మూలకు చేరిన చేతి పంపులు

జగ్గంపేట రూరల్, జూలై 16: మండలంలోని జె.కొత్తూరులో చేతి పంపులు మూలకు చేరాయి. దీంతో గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. 2,3 రోజులకు ఒక సారి నీళ్లు రావడం, అవి అరకొరగా రావడంతో గ్రామంలో నీటి ఎద్దడి తీవ్ర స్థాయికి చేరుకుంది. సుమారు గ్రామంలో 10బోర్లు ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో పని చేయడం లేదు. ఇకనైనా అధికారులు స్పందించి గ్రామంలో నీటి ఎద్దడిని నివారించాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.


జె.కొత్తూరులో పనిచేయని చేతి పంపు

# కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని ● ప్రత్తిపాడు ● జగ్గంపేట

# వాడీవేడిగా నగర పంచాయతీ సమావేశం

### అధికారులను నిలదీసిన కౌన్సిలర్లు


సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సత్యవతి, అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ బొదిరెడ్డి

ఏలేశ్వరం, జూలై 16: ఏలేశ్వరం నగర పంచాయతీ సాధారణ సమావేశం వాడీవేడిగా జరిగింది. చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన సమావేశంలో కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి మాట్లాడుతూ 20 వార్డుల్లో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని కమిషనర్, మేనేజర్ కేవలం కార్యాలయానికే పరిమితమవుతున్నారని, అధికారులు పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు ఏ చర్యలు తీసుకోవడంలేదని ఆరోపించారు. చెత్తను తరలించే ట్రాక్టర్ల నిర్వహణకు అవసరమైన వ్యయాన్ని సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకున్నామని కమిషనర్ బదులిచ్చారు. పాలకవర్గం దీనిని ఆమోదించారు. 9వవార్డు కౌన్సిలర్ అలమండ చలమయ్య మాట్లాడుతూ అన్నివార్డుల్లోను పారిశుధ్యానికి నగర పంచాయతీ ప్రాధాన్యమిస్తుందన్నారు. నగర పంచాయతీలో ప్రవేశపెడుతున్న తీర్మానాలు అజెండాలోని అంశాలపై తమ ప్రమేయం ఏమీలేదని, దినపత్రికల్లో ప్రకటన అనేఅంశం ప్రభుత్వం ఆదేశాలకు అణుగుణంగా వరుస సంఖ్యలో ఇవ్వాల్సి అంశమని కౌన్సిలర్లకు తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ అజెండాలోని అంశాలను చదివి వినిపిస్తుండగా వైసీపీ కౌన్సిలర్లు అడ్డు తగిలారు. అజెండాలో కొన్ని అంశాలు తమ దృష్టికి రాలేదని, వీటిపై పూర్తిస్థాయి చర్చ జరగాలని కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు అన్నారు. దినపత్రికలకు ప్రకటనలను చెల్లించాల్సిన బిల్లులు, పారిశుధ్యం నిర్వహణపై చర్చ జరిగింది. వార్డుల వారీగా సంబంధిత కౌన్సిలర్లతో సంప్రదించకుండానే అధికారులు నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. పట్టణంలో పలుప్రాంతాల్లో వ్యక్తి గత కుళాయిలు వేయించుకున్నవారి ఇబ్బందులను 14వ వార్డు కౌన్సిలర్ మూది నారాయణస్వామి లేవనెత్తారు. తాగునీరు రావడంలేదని పన్ను మాత్రం వస్తుందని స్థానికులు తమ దృష్టికి తీసుకువస్తున్నారన్నారు. కుళాయిల సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. నీరు రాని కుళాయిలను డమ్మీ చేసేందుకు నిర్ణయించామని అధికారి ఏఈ అనూష తెలిపారు. పలు అంశాలను వచ్చే సమావేశంలో చర్చిద్దామని కౌన్సిలర్లు చెప్పడంతో చైర్‌పర్సన్ వాయిదా వేశారు. వైస్ చైర్‌పర్సన్‌లు శిడగం త్రివేణి, మసురపు బుజ్జి, కౌన్సిలర్లు సామంతుల హైమావతి, సు టంకర హైమావతి, యండగుండి నాగబాబు, కోటనాల వెంకటరమణ పెంద్ర శ్రీను పాల్గొన్నారు.

## జనసేన సభ్యత్వాల నమోదు వేగవంతం చేయాలి

### జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్


సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మలపల్లి

గండేపల్లి, జూలై 16: జగ్గంపేట నియోజకవర్గంలో జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వాల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని జగ్గంపేట ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. జగ్గంపేటలోని పరిణయ ఫంక్షన్ హాల్లో తుమ్మలపల్లి ఆధ్వర్యంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జన సైనికులంతా సభ్యత్వ నమోదును ప్రతిష్టాత్మకంగా తీసుకుని నూరుశాతం పూర్తి చేయాలన్నారు. ఇది కేవలం సభ్యతం నమోదు మాత్రమే కాదని, పేదవాడి కుటుంబాన్ని ఆదుకునే భరోసా అన్నారు. రూ.500 సభ్యత్వ నమోదు ఇస్తే దానికి రూ.1500 జోడించి ఒక వ్యక్తికి రూ.2వేలు సభ్యత్వం ఇన్సూరెన్స్ కట్టడం జరుగుతుందన్నారు. దురదృష్టవశాత్తూ ఆ వ్యక్తికి ఏదైనా జరగరానిది జరిగితే ఈ సభ్యత్వం ద్వారా ఆ కుటుంబాన్ని ఆదుకుంటుందని తెలిపారు.

### గురుపూజోత్సవంలో పాల్గొన్న రమేష్

జగ్గంపేట, జూలై 16: జగ్గంపేట విష్ణు ఆలయంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి సందర్భంగా గురుపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ హిందువులందరూ సమాజసేవలో పాల్గొంటూ హిందూ పరిరక్షణకు నడుం బిగించాలన్నారు. జిల్లా కార్యవర్గసభ్యులు శివయ్య, కాబోలు స్వామి, సీతారాం, జనసేన నాయకులు మాదరపు వీరబాబు, మరిసే రామకృష్ణ, సూరపరెడ్డి నరేష్, రామవరం ఎంపీటీసీ దొడ్డి శ్రీను, జిల్లా కార్యదర్శి బుదిరెడ్డి శ్రీనివాస్, వీరభద్ర జట్ల, తుమ్మల పణేంద్ర, తుమ్మల స్వామి, మండపాక శ్రీరామ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సభ్యత్వాల నమోదులో అగ్రగామిగా నిలుపుదాం

### జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి


సమావేశంలో నాయకులు, మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గొల్లప్రోలు రూరల్, జూలై 16: సభ్యత్వ నమోదులో పిఠాపురం నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలుపుదామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసంలో మంగళవారం గతంలో జనసేన సభ్యత్వాలు చేసిన వలంటీర్లు, ఇతర నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18 నుంచి సభ్యత్వ నమోదు ప్రారంభం కానున్నదని తెలిపారు. జనసేన క్రియాశీలక సభ్యులుగా చేరిన వారికి రూ.5లక్షల ప్రమాద బీమా ఉంటుందని చెప్పారు. నియోజకవర్గంలో 25వేలకు పైగా క్రియాశీలక సభ్యత్వాలు చేయాలని కోరారు. పార్టీ పట్ల అభిమానంతో ప్రతి ఒక్కరిని కలుసుకుని సభ్యులుగా చేరాలని కోరాలని సూచించారు. పలువురు నాయకులున్నారు.

## 'స్థలాలు కొనుగోలు చేయవద్దు'

సామర్లకోట, జూలై 16: మండలంలో పెదబ్రహ్మదేవం గ్రామ కాలువ ఆవతలి వైపున వేణుగోపాలనగర్‌కి చేర్పి పుట్టా సూర్యనారాయణకు చెందిన సర్వే నంబరు 230-1 జిరాయితీకి చెంది ఎకరా 10 సెంట్ల స్థలంలో ఏర్పాటు చేసిన అనధికార లేఅవుట్‌లో ఎవరూ స్థలాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని పెదబ్రహ్మదేవం గ్రామ పంచాయతీ కార్యదర్శి రామనాధం మంగళవారం తెలిపారు. ఈ మేరకు అనధికార లేఅవుట్ స్థలాల్లో పంచాయతీ హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీను పంచాయతీ సిబ్బందితో కలిసి ప్రదర్శించారు. సదరు స్థలానికి కాకినాడ అర్బన్ డవలప్‌మెంట్ అధికారి వారి అనుమతులు పొందకుండా గ్రావెల్ మట్టితో ఫిల్లింగ్‌చేసి ప్లాట్‌లుగా విభవించి ప్లాట్లుగా విక్రయించడం చట్టవిరుద్ధమన్నారు. ఏ అనుమతులు లేని ప్లాట్‌లను కొనుగోలు చేసినవారికి గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు, ఎన్వోసీలు జారీచేయబడదని రామనాదం చెప్పారు.


హెచ్చరిక ఫ్లెక్సీ ఏర్పాటు చేస్తున్న కార్యదర్శి

## ఖాళీ స్థలాల్లో నిల్వ నీటిని తొలగించాలి

### కాకినాడ కమిషనర్ వెంకటరావు


అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 16: అపరిశుభ్రత, దోమల తీవ్రతకు కారణమవుతున్న ఖాళీ స్థలాల్లో నిల్వ నీటిని వెంటనే తొలగించాలని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు స్థల యజమానులను కోరారు. ఇందుకు సంబంధించి కాకినాడ నగరపాలక సంస్థ పరిధిలోని సుమారు 160మంది స్థల యజమానులకు నోటీసులు జారీ చేశామన్నారు. మంగళవారం ఆయన కాకినాడ ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో జరుగుతున్న పూడికతీత పనులను పర్యవేక్షించారు. అక్కడి పనులు ప్రగతిని పరిశీలించి విధుల్లో సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం జగన్నాధపురం రణదీప్‌నగర్ ప్రాంతంలోని మేజర్ డ్రైన్‌ను సందర్శించి గుర్రపుడెక్క, పేరుకుపోవడాన్ని గుర్తించి తక్షణమే తొలగించాలని ఆదేశించారు. అదే ప్రాంతాన్ని ఆనుకుని ఉన్న తూరంగి గ్రామ పరిధిలోని ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండడాన్ని గుర్తించారు. కమిషనర్ మాట్లాడుతూ ఖాళీ స్థలాలను నిరుపయోగంగా, నిర్లక్ష్యంగా వదిలిపెట్టడం వల్ల పిచ్చిమొక్కలు పెరిగి డంపింగ్ యార్డుల్లా తయారై దోమలు పెరిగి ప్రజారోగ్యానికి ఇబ్బందిగా మారుతున్నాయన్నారు. వెంటనే ఖాళీ స్థలాలను శుభ్రం చేయించాలని ఆదేశించారు. పూడికతీత పనులు పూర్తయిన అనంతరం అక్కడి వ్యర్థాలను తక్షణమే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంహెచ్ఓ డాక్టర్ పృధ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సచివాలయ ఉద్యోగులున్నారు.

## ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చేపట్టాలి

### పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ


మల్లవరం ఆర్ఆర్‌బీ చెరువులో గాలింపు చర్యలను పరిశీలిస్తున్న వర్మ

గొల్లప్రోలు రూరల్, జూలై 16: గల్లంతైన వృద్ధుడి కోసం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలతో గాలింపు చర్యలు చేపట్టాలని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ డిమాండ్ చేశారు. గొల్లప్రోలు మండలం ఏకేమల్లవరం గ్రామానికి చెందిన తటవర్తి వేమన్నదొర ఈనెల 7న పశువుల మేపడానికి వెళ్లి తిరిగి రాలేదు. ఆర్ఆర్‌బీ చెరువులో పడి గల్లంతయి ఉండవచ్చని కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. కానీ వృద్ధుడి ఆచూకీ లభించని నేపథ్యంలో వర్మ అధికారులతో మాట్లాడారు. స్థానికంగా ఉన్నవారితో గుర్రపుడెక్క తొలగిస్తే ఫలితం ఉండదని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఇటువంటి సంఘటన జరిగితే ఎన్‌డీఆర్ఎఫ్‌తో గాలింపు చేపట్టామన్నారు. ఇదే విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడటం జరిగిందని చెప్పారు. బుధవారం మధ్యాహ్నం నుంచి మరోమారు గాలింపు చర్యలు ప్రారంభమవుతాయని తెలిపారు. గొల్లప్రోలు తహశీల్దారు ఉదయభాస్కర్, టీడీపీ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉలవకాయల దేవేంద్రుడు, మల్లిపూడి వీరబాబు, మాజీ జడ్పీటీసీ మడికి ప్రసాద్, తటవర్తి చంటి, కడిమిశెట్టి విజయభాస్కరరెడ్డి, అశోక్, పిట్టా రాంబాబు, బత్తిన మురళీ పాల్గొన్నారు.

## గ్యాస్ కంపెనీల్లో కార్మిక చట్టాలు అమలు చేయాలి


### ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

కాకినాడ సిటీ, జులై 16: ఎల్పీజీ గ్యాస్ కంపెనీల్లో కార్మిక చట్టాలు అమలు చేయాలని, కార్మికులందరికీ అపాయిమెంట్ ఆర్డర్లు, ఐడీ కార్డులు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్థానిక కచేరీపేట వద్ద గల ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్యాస్ డెలివరీ వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. యూనియన్ అధ్యక్షుడు ఎం.రాజు అధ్యక్షత వహించగా, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె వెంకటేశ్వర్లు, జి.రాజ్‌కుమార్, యూనియన్ నాయకులు నాయుడు, ప్రసాద్, సత్తిబాబు, వీరబాబు, సత్యనారాయణ ప్రసన్నకుమార్ తదితరులు ప్రసంగించారు. కనీస వేతనం అమలు చేయాలని, పీఎఫ్ ఈఎస్ఐ, బోనస్, గ్రాడ్యుటీ, జాతీయ సెలవులు, పండుగ సెలవులు, వారాంతపు సెలవులు అమలు చేయాలని వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. కార్మిక చట్టాలు అమలు చేయడం లేదని, కార్మికులపై శ్రమ దోపిడి, వేతన దోపిడి సాగిస్తున్నారని విమర్శించారు. కొన్ని గ్యాస్ ఏజెన్సీలలో కార్మికులు యూనియన్ పెట్టుకుంటే వారిని విధుల నుంచి తొలగించారన్నారు. గ్యాస్ కంపెనీలలో కార్మికులకు ఉద్యోగ భద్రత, ఉపాధి భద్రత కల్పించాలని, చట్టబద్ధ హక్కులు, సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఎస్సీ వర్గీకరణ సాధించే వరకూ పోరాటం సాగిస్తాం

### ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు


గంగబాబును అభినందిస్తున్న నాయకులు

పిఠాపురం, జూలై 16: చట్టబద్ధంగా ఎస్సీ వర్గీకరణ సాధించే వరకూ పోరాటం సాగిస్తామని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పలివెల రవికాంతకుమార్ తెలిపారు. పిఠాపురం ఇందిరా నగర్‌లో మంగళవారం జరిగిన ఎమ్మార్పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఎన్డీయేకు అండగా నిలిచామని, ఎన్నికల ముందు వర్గీకరణపై ఇచ్చిన హామీని కూటమి పార్టీలు నిలబెట్టుకోవాలని కోరారు. వర్గీకరణ ద్వారా దళితుల్లో ఉన్న అన్ని ఉపకులాలకు న్యాయం జరుగుతుందన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాటసమితిని పటిష్టపరిచే ప్రక్రియలో భాగంగా ఎమ్మార్పీఎస్ పిఠాపురం నియోజకవర్గ అధ్యక్షుడిగా చేట్ల గంగబాబును నియమిస్తున్నట్టు ప్రకటించారు. గంగబాబును పలువురు నాయకులు అభినందించారు. బాధ్యతలు అప్పగించిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య, ఉపాధ్యక్షుడు రవికాంతకుమార్‌కు గంగబాబు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పలివెల శివమణి, లోవరాజు, ముప్పిడి సురేష్, పెదపాటి సత్యనారాయణ, గెడక గంగరాజు, విప్పర్తి కృష్ణ తదితరులున్నారు.

## 'వ్యయ వివరాలు తెలపాలి'

ప్రత్తిపాడు, జూలై 16: మండలంలో ధర్మవరం పంచాయతీ అభివృద్ధి పనులకు చేసిన వ్యయ వివరాలు తెలపాలంటూ పలువురు కోరారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి సమక్షంలో గ్రామసభ నిర్వహించారు. టీడీపీ,జనసేన బీజేపీ నాయకులు దాట్ల అప్పన్నబాబు,బొండాడ నారాయణ, దాసం శేషారావు, ఊటా వీరబాబు, బొల్లు చిన్నోడు గ్రామంలో ఇప్పటి వరకు చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వాటికి వెచ్చించిన నిధులు, భవిష్యత్‌లో చేసే అభివృద్ధి కార్యక్రమాలు తెలపాలంటూ కోరారు. త్వరలోనే తెలియజేస్తామని కార్యదర్శి ద్విబాష్యం శ్రీనివాసరావు చెప్పారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధుల పట్ల గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులు కోరారు. సొసైటీ మాజీ అధ్యక్షుడు దాట్ల కృష్ణబాబు, మాజీ చైర్‌పర్సన్ జువ్వల బాబులు, పాటి బాబురావు తదితరులున్నారు.


ధర్మవరంలో గ్రామసభ నిర్వహిస్తున్న దృశ్యం

www.andhrajyothy.com

## సీఎం చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే కొండబాబు


చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న ఎమ్మెల్యే

కాకినాడ సిటీ, జులై 16: కాకినాడ నగర అభివృద్ధి ప్రణాళిక నివేదికను అమరావతిలోని సచివాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును మంగళవారం సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు కలిసి అందజేశారు. స్మార్ట్‌సిటీ అభివృద్ధి ప్రణాళికలతో కేంద్ర ప్రభుత్వ నిధుల మంజూరు, పెండింగ్ నిధులు, ఉప్పుటేరుపై మూడవ బ్రిడ్జి నిర్మాణం తదితర అంశాలను ఎమ్మెల్యే కొండబాబు వివరించారు. కాకినాడ నగర సమస్యలు, నగర అభివృద్ధికి కావల్సిన వనరులను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు.

## మన్యవారిపాలెంలో పరిశీలన

### ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన అధికారులు


లే అవుట్‌ను పరిశీలిస్తున్న జగ్గంపేట తహశీల్దార్

జగ్గంపేట రూరల్, జూలై 16: మన్యవారిపాలెం గ్రామంలో జగన్న లేఅవుట్‌ను దున్నేసిన విధానంపై ఆంధ్రజ్యోతి ప్రచురించిన కథనానికి రెవెన్యూ యంత్రాంగం స్పందించింది. జగ్గంపేట తహశీల్దార్ ఎస్‌కె.ఇంతియాజ్‌పాషా రెవెన్యూ యంత్రాంగంతో కలిసి లే అవుట్‌ను పరిశీలించి రైతులతో మాట్లాడి విషయాలను తెలుసుకున్నారు. ఏమైనా ఇబ్బంది ఉంటే మా దృష్టికి తీసుకురావాలని, లక్షలు వెచ్చించి పేదలకు ఇళ్ల స్థలాలు మంజూరు చేస్తే ఇలాంటి చర్యలు చేయడం తగదన్నారు. రెవెన్యూ యంత్రాంగాన్ని పూర్తిస్థాయి వివరాలు సేకరించాలని కోరారు. అలాగే లే అవుట్‌ను నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందిని ఆదేశించారు. వాస్తవ పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తహశీల్దార్ తెలిపారు.

## పొదులు, తుప్పల తొలగింపు

### ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

సామర్లకోట, జూలై 16: పట్టణ పరిధిలో పలు కూడలి ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలకు, డిస్ట్రిబ్యూటరీ ట్రాన్స్ ఫార్మర్లకు ప్రమాదభరితంగా అల్లుకున్న పొదులు, తుప్పలను విద్యుత్ అధికారులు ఎట్టకేలకు మంగళవారం తొలగించారు. ప్రమాదభరితంగా ట్రాన్స్‌ఫార్మర్లు పేరిట సోమవారం ఆం ట్ర్రజ్యోతి పత్రికలో కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ మేరకు విద్యుత్ ఈఈ ప్రభాకర్ ఆదేశాల మేరకు మంగళవారం ఏడీఈ కిరణ్ తదితర సిబ్బంది పట్టణ ంలో పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్లకు అల్లుకున్న పొదులు, తుప్పలను తొలగించారు. పట్టణంలో ఇంకా పలు ప్రాంతాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఉన్న తుప్పలు, పొదులు కూడా తొలగించాలని పలువురు కోరుతున్నారు.


తుప్పలు, పొదులు తొలగించిన అనంతరం ఓ ట్రాన్స్‌ఫార్మర్

## బ్రాహ్మణ సంఘం సమావేశం

జగ్గంపేట, జూలై 16: జగ్గంపేట బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు, టీడీపీ సీనియర్ నాయకుడు వేములకొండ జోగారావు ఇంటి వద్ద మంగళవారం జగ్గంపేట గాయిత్రి బ్రాహ్మణ సంఘం సమావేశం ఏర్పాటు చేశారు. జోగారావు మాట్లాడుతూ ఈనెల 21న ఉదయం 9గంటలకు జోగారావు ఇంటి వద్ద తేనేటి విందు కార్యక్రమం ఉంటుందన్నారు. ఎన్వీడీ ప్రసాద్, చంద్రమౌళి వెంకటశాస్త్రి, గురజాపు సోమసుందరం, కూచిమంచి రవిశాస్త్రి, క్రాంతికుమార్, ఆంజనేయులు, బాబ్జి, మాటేవీకృష్ణ, శ్రీనివాస్, బ్రాహ్మణ సంఘ సభ్యులు ఉన్నారు.

## బాలల చట్టాలపై అవగాహన ర్యాలీ


పెద్దాపురంలో అవగాహన ర్యాలీ దృశ్యం

పెద్దాపురం, జూలై 16: మహిళలు, బాలల చట్టాలపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో మంగళవారం అవగాహనా ర్యాలీని సీడీపీవో ఉష ఆధ్వర్యంలో చేపట్టారు. బాల్యవివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు, అక్రమ రవాణా, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల బిక్షాటన తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పెద్దాపురం డీఎస్పీ విచారణ

రౌతులపూడి, జూలై 16: లచ్చిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన మైనర్ గర్భం దాల్చడంపై పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి విచారణ చేశారు. అదే గ్రామానికి చెందిన వ్యక్తి తనను నమ్మించి మోసం చేసినట్టు మైనర్ బాలిక ఫిర్యాదు చేయడంతో డీఎస్పీ బాలిక, ఆమె కుటుంబసభ్యులను విచారించారు. ఈ కేసులో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్టు రౌతులపూడి ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

## మిషన్ శక్తిపై అవగాహన

గండేపల్లి, జూలై 16: స్థానిక వెలంపేట రామాలయంలో మంగళవారం మిషన్‌శక్తిపై గ్రామంలోని బాలికలకు సీడీపీవో ఎం.పూర్ణిమ అవగాహన కల్పించారు. బెదిరింపులు లేని వాతావరణం, ఆర్థికంగా శక్తిమంతులను చేయడం, సూక్ష్మ రుణాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.హనుమంతరావు, ఈవోపీఆర్డీ వీఎస్ఎన్.మూర్తి, హెల్త్ అసిస్టెంట్ పి.వీరబాబు, సూపర్‌వైజర్ ఎ.నాగపార్వతి పాల్గొన్నారు.

## 'లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలి'

తాళ్లరేవు, జూలై 16: 2014లో గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించాలని పోలేకుర్రు టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు వడ్లమూరి సతీష్ కోరారు. 2019లో అధికారం చేపట్టిన వైసీపీ ప్రభుత్వం టీడీపీ హయాంలో నిర్మించిన గృహలబ్ధిదారుల బిల్లులు నిలిపివేసిందన్నారు. టీడీపీ తిరిగి అధికారంలోకి వచ్చినందున లబ్ధిదారులు బిల్లుల కోసం ఆశతో ఎదురుచూస్తున్నారని ఆయన చెప్పారు.